

# ఉన్నంతలో...

వి. రాజారామమోహనరావు

'ఎవరు?' అన్నట్టు చూశాడు రామారావు.

"మేం... మీ ఇంటి ఎదురు సందులో ఉంటాం. మా ఆయన పరిస్థితి ఏం బావుండ లేదు. మీ సాయం కోసం వచ్చాను," అంది అరుంధతి.

"ఏం సాయం కావాలి?" అన్నాడు ఆమెవైపు చూస్తూ.

"వెంటనే ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు," అంది తల వంచుకుని.

ఆమె ఎవరో తెలియకపోయినా, ఆమె పరిస్థితి తెలుస్తోంది. వసారాలోంచి లోపలికి వెళ్లి అయిదు నిముషాల్లోపే అరుంధతితో బయలుదేరాడు రామారావు.

అరుంధతి ఇంటిపక్క వాళ్ల సాయంతో, ఆమె భర్తని కార్లో ఎక్కించారు. మనిషి స్పృహలో లేడు.

కారు మెయిన్‌రోడ్ దగ్గరికి వస్తుండగా... "ఏ హాస్పిటల్‌కి," అని అడిగాడు రామారావు.

*

ఆ పదిహేను రోజులు అలా గడుస్తాయని ఆ ముగ్గురిలో ఎవరూ అనుకోలేదు.

అరుంధతి విషయంలో, 'ఏమిటి? ఎందుకు?' అని పెద్దగా ఆలోచించలేదు రామారావు. ఆమె భర్తని, తన స్నేహితుడి నర్సింగ్ హోమ్‌లో చేర్పించాడు. అతనికి చాలా మంచి వైద్యమే అందింది. కోలుకోవటానికి పదిహేను రోజులు పట్టింది. భర్తకి అంతటి సహాయం రామారావు ద్వారా అందుతుందనిగానీ, అంత డబ్బు ఖర్చవుతుందని గానీ అరుంధతీ అనుకోలేదు.

స్పృహలోకి వచ్చిందగ్గర్నించీ ఏం జరుగుతోందో చూస్తున్నాడుగానీ ఆలోచించి అర్థం చేసుకోగలిగిన ఓపిక అరుంధతి భర్తకీ లేదు. అరుంధతి భర్త పేరు మంగరాజు. హాస్పిటల్‌కి చూట్టానికి వచ్చినప్పుడు, 'రాజుగారూ, ఎలా వుంది,' అని రామారావు పలకరించేవాడు. 'బాగానే వుంది,' అన్నట్టు సైగ చేసేవాడు రాజు. వారిద్దరి మధ్యా సంభాషణ అంతవరకే నడిచేది.

రాజుకి ఆరునెలలుగా బాగోలేదు. ఇల్లు కదల లేకపోతున్నాడు. ఈ స్ట్రోకుతో పూర్తిగా ఇంక అతను మంచం మీదే... ప్రాణం దక్కింది.

అంతవరకే ఆ విషయం ముగ్గురికీ తెలుసు. ఆ మర్నాడు రాజుని డిశ్చార్జ్ చేస్తామన్నారు.

కారులో హాస్పిటల్ నుంచి వస్తున్న అరుంధతి, రామారావు పక్కనే వెనుక సీట్లో ఉంది. అతనికి తన కృతజ్ఞత తెలుపుకోవాలి. నెమ్మదిగా, "కొంచెం మీతో మాట్లాడాలి," అంది ముందున్న డ్రైవర్ వేపు చూస్తూ.

అరుంధతి సంశయం అర్థమైంది రామారావుకి. "కాఫీ తాగి వెళదాం," అని ఎక్కడికి వెళ్లాలో చెప్పాడు డ్రైవర్‌కి. వాళ్లు వెళ్లిన కాఫీహౌస్, ఆ సమయంలో చాలా వరకు ఖాళీగా వుంది. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

"దేముడిలా మీరు ఆదుకోకపోతే ఆయన దక్కేవారు కాదు. ఎంతైందో తెలియకపోయినా డబ్బు చాలానే ఖర్చు చేశారు. ఆ డబ్బు తిరిగి ఇచ్చే పరిస్థితిలో లేను. మీ ఇంట్లో చాకిరి చేసో లేదో మీరు ఇప్పిస్తే

ఏదైనా పనిచేసి మీ ఋణం తీర్చుకుంటాను,'' అంది అరుంధతి.

ఆమెవైపే చూస్తున్న రామారావుకి, అరుంధతి ముఖం దిగులుతో నిండిపోయినట్టు కనబడింది.

''నువ్వేం తిరిగి నాకు డబ్బు ఇవ్వక్కర్లేదు. ఋణం, అదీ ఇదీ అని దిగులు పెట్టుకోకు,'' అన్నాడు. మొదట్నించీ ఆమెని నువ్వే అనటం అలవాటైంది.

అరుంధతి కళ్లల్లో నెమ్మదిగా ప్రారంభమైన తడి, రెండు మూడు చుక్కల్లా మారి ఆమె బుగ్గల్ని దాటాయి. చీరచెంగు అడ్డు పెట్టుకుని అతి కష్టం మీద ఏడుపుని ఆపుకుంటోందని రామారావుకి అర్థమవుతోంది.

''ఊరుకో... డబ్బు బెంగ వద్దన్నానుగా,'' అన్నాడు.

ప్యాకింగ్ మెటీరియల్ తయారుచేసే ఓ ఫ్యాక్టరీలో చిన్న ఉద్యోగం చేస్తూ, అనారోగ్య భర్తని పోషిస్తూ కాలం గడుపుతోంది అరుంధతి. ఆర్థికంగా చాలా ఇబ్బందిగా వుంది. ఇప్పుడు తగిలిన దెబ్బ సామాన్యమైంది కాదు. భర్త మందులకే నెలకి మూడు వేలు కావాలి. ఎంత చాకిరి చేసినా సంసారం సాగేలా లేదు. రామారావు చేసిన సాయం గట్టెక్కించినా ఏదో భారంగా వుంది. అరుంధతికి ఏడుపు ఆగటం లేదు.

తాగమని మంచినీళ్లు అందించాడు రామారావు. ఆ తర్వాత కాఫీ తాగాక కొంచెం తేరుకుంది. కాఫీహౌస్ లోంచి బైటికి వచ్చేటప్పటికి అరుంధతి ఇంటి విషయాలు చాలావరకు తెలిశాయి రామారావుకి.

పెద్ద కష్టంలో ఉన్నప్పుడు, పరాయి మగవాళ్ల సానుభూతి, ఓదార్పు ఆడవాళ్లని మరింత బలహీనుల్ని చేసి కరిగిస్తాయి. మర్నాడు మంగరాజుని హాస్పిటల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు.

భర్త పరిస్థితి చూస్తే అతన్ని, అలా ఇంట్లో వదిలి తను ఉద్యోగానికి వెళ్లే అవకాశం కనపడలేదు అరుంధతికి. తమని చూడటానికి మరునాడు ఇంటికి వచ్చిన రామారావుతో అదే మాట అంది అరుంధతి ఎంతో దిగులుగా. ''వెళ్లకు... పరిస్థితి చక్కబడేవరకూ అన్నీ నేను చూస్తాను. నువ్వేం బెంగపడకు,'' అన్నాడు రామారావు ప్రతిస్పందిస్తూ.

ఆ మాటతో అరుంధతికి దుఃఖం ఆగలేదు. ఆమె గుండెల్లో గూడు కట్టుకున్న కృతజ్ఞత. రామారావు అందిస్తున్న ఓదార్పు కలగలిసి వాళ్లిద్దర్నీ దగ్గర చేశాయి. పరాయి సంబంధాల ప్రాతిపదికలు చాలావరకు ఇలాగే ఉంటాయేమో. నెలరోజులు గడిచేటప్పటికి రామారావుకి చాలా స్పష్టత వచ్చింది. నెలకి అరుంధతికి ఇంటికి పదివేల రూపాయలు ఖర్చవుతున్నాయి. అది అతనికి ఎంతమాత్రం భారం కాదు.

రామారావుకి భార్య లేదు. అరుంధతికి భర్త వున్నా శారీరకంగా అతను దాంపత్యానికి పనికిరాడు. అంతా వీలు కుదిరినట్టుగానే ఉంది.

కూతురు, అల్లుడు, వాళ్ల పిల్లలు ఉన్నారు. వాళ్లని తనతోటే, తనింట్లోనే పెట్టుకున్నాడు రామారావు. అందువల్ల ఆ ఇంట్లో అతనికి వీలుకాదు. అరుంధతి ఇల్లు కాబట్టి ఫరవాలేదు.

భార్య తర్వాత మరే స్త్రీ పట్లా ఆసక్తి చూపించ లేదు రామారావు. కష్టంలో అరుంధతి అలా రావటం ఏ ఉద్దేశం లేకుండానే ఆదుకోవటం... ఆ తర్వాత దగ్గరితనం... అంతా దానంతటదే జరిగిన ఘటనలా వుంది అతనికి. అరుంధతి ఆలోచనలు ఎలా ఉన్నాయో అని ఆలోచించాల్సిన అవసరం రాలేదు అతనికి.

*

మూడు నెలలు, మూడు వారాల్లా గడిచిపోయాయి రామారావుకి. యాభై రెండేళ్ల వయసు. ఆరోగ్యం బావుంది. డబ్బుకి ఎంతమాత్రం ఇబ్బంది లేదు. కూతురు కుటుంబం ఉంది.

భార్య లేకపోతే మాత్రం తనకేమిటిలే అనుకున్నాడు రామారావు. కానీ ఈ మూడు నెలల అనుభవం తర్వాత తన జీవితంలో లేనిదేమిటో తెలిసొచ్చింది.

అతని లోలోపల... సుప్త చైతన్యంలోని ఎడారి లాంటి ఒంటరితనాన్ని, అరుంధతి ఓ నీటిచెలమలా స్పృశించింది. ఈ మూడు నెలలూ అరుంధతి ఇంట్లో ఏం జరిగినా అతనికి బాగానే ఉంది.

సంతానంలేని, నలభై రెండేళ్ల అరుంధతి ప్రౌఢ ముగ్ధత్వం రామారావుకి అమృతపానంలా ఉంది. తిరిగి తన జీవితం కొత్త చిగుళ్లు తొడిగినట్టు ఆనందపడ్డాడు. బతుకు ఇదివరకటిలా అలజడిగా లేదు. ఆ విషయం తెలుస్తోంది అరుంధతికి. అందుకే రామారావుకి వీలున్నంత అనుకూలంగా ఉండగలుగుతోంది.

చాలా మంచి సంగీతం ఆస్వాదిస్తున్నామన్న ఎరుకలో అతి చిన్న అపశృతి కూడా ఇబ్బందే. మరో నెల గడిచేటప్పటికి రామారావుని ఓ అపశ్రుతి పట్టుకుంది. చాలా సున్నితమైన, చిత్రమైన అపశ్రుతి.

అరుంధతి తనతోటి, పూర్తిగా తన మనిషిలా వున్న సమయంలో... ఒక్కోసారి ఆ గంట మోగుతోంది. ఆ శబ్దం కోసమే ఎదురుచూస్తున్నంత తొందరగా వెంటనే వెళ్లిపోతుంది అరుంధతి.

మంగరాజుకి నడుం కింద భాగమంతా చచ్చుబడిపోయింది. మాట కూడా పోయింది. మంచం కుడి పక్కన టేబుల్ మీద పెట్టిన గ్లాసులో నీళ్లు అందుకుని తాగటం మాత్రం చెయ్యగలుగుతున్నాడు. అందుకే అతనికి ఏదైనా అవసరమనిపించినప్పుడు పిలవటానికి అతనికి అందుబాటులో చిన్న గంట ఏర్పాటుచేసింది అరుంధతి. ఆ గంట శబ్దం, ఈమధ్య నిష్టూరమైన నిజాన్ని గుర్తుచేస్తోంది రామారావుకి.

'ఎంత ఎలా ఉన్నా, అరుంధతి పూర్తిగా తన మనిషి కాదు,' అన్న భావన అన్నింటిలోకి కష్టంగా వుంది.

ఆమె ఆ శబ్దం వెనకే వెళ్లి మంగరాజుని పరిశుభ్రపరిచి, తన చేతులు బాగా శుభ్రం చేసుకు వచ్చినా రామారావుకి ఈమధ్య ఇబ్బందిగానే ఉంటోంది.

అరుంధతిని ఏమీ అనలేడు. తను ఇబ్బంది పడకుండా వుండనూ లేడు. ఈ ఇబ్బంది అరుంధతి ఇంట్లో వున్నప్పుడే కాదు. తన ఇంటికి వచ్చినా రామారావు ఆలోచనని వదలటం లేదు. ఓ విషపు నీడలా అతన్ని అంటుకుపోయింది. మథనపడి, మథనపడీ చివరికి ఓ నిర్ణయానికి వచ్చాడు రామారావు.

*

రామారావు చెప్పిందంతా విన్నాక... చాలారోజుల తర్వాత తిరిగి తనలోకి అలజడి ఉప్పెనలా చొచ్చుకొచ్చినట్టు కంగారుపడింది అరుంధతి.

ఏం జవాబు చెప్పాలో తోచలేదు. అక్కడ అతని ఎదురుగా ఉండలేక లేచి వెళ్లిపోవాలనిపించింది. దానికీ శక్తి చాలని నిస్సత్తువ కమ్మేసినట్టు తలొంచుకుని అలాగే కూర్చుండిపోయింది.

"నా ఇబ్బంది చెప్పాను. అయితే మరో పదివేలు నెలకి ఖర్చవుతాయి. ఇలాంటి జబ్బు మనుషుల్ని జాగ్రత్తగా చూసుకునే హోమ్ అది. రోజూ డాక్టరు కూడా వచ్చి చూస్తాడు. రాజుగార్ని అక్కడ చేరిస్తే నీకూ ఈ చాకిరీ తప్పుతుంది... సరేనా," అన్నాడు రామారావు.

అరుంధతి నుంచి ఏ జవాబు రాకపోవటం, వంచిన తల ఎత్తకపోవటం గమనించి, "ఇప్పుడే కాకపోయినా... సాయంత్రానికైనా ఆలోచించి చెప్పు," అన్నాడు రామారావే తిరిగి. ఆలోచించటానికేం లేదని అరుంధతికి ఆ క్షణమే తెలుసు. రామారావు బయటికి వెళ్లిపోయినా చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది.

అలా కూర్చున్న అరుంధతి కళ్ల ముందు రామారావే మెదులుతున్నాడు. ఈ నాలుగైదు నెలలుగా గడిచిన జీవితం ఆలోచనల్లో కదుల్తోంది. భర్త ఏమైపోతాడోనని కంగారుపడిన ఆ రోజు తను సందులోంచి మెయిన్ రోడ్డు మీదకి ఓ పిచ్చిదాన్లా వచ్చింది. ఎదురుగా ఉన్న ఇంటి ఆవరణలో రామారావు కనిపించాడు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మనిషికి ఏది దొరికితే అదే పెద్ద ఆధారం. అలా అతని దగ్గరికి వెళ్లి అడిగింది. అతను అంతగా సాయపడతాడనిగానీ, ఇంతగా ఆసరా అవుతాడనిగానీ లీలగానేనా అనుకోలేదు అరుంధతి.

అప్పుడు అతని గురించేం తెలియదు. ఇప్పుడు అతనేమిటో తెలుసు. చాలా ఏళ్ల క్రితం అన్ని వదిలేసి భార్య వెళ్లిపోయింది. ఆ తర్వాత ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఎందుకు వెళ్లిపోయిందో అతను స్పష్టంగా చెప్పలేకపోయాడు. ఎదిగిన కూతుర్ని కూడా వదిలేసినందుకు బాధ కలిగినా, అది తనలోనే దాచుకున్నాడు. ఆవిడ లేకపోయినా, తనకేం లోటు లేదన్న మొండితనం అలవాటు చేసుకున్నాడు.

అతని ఆ రకం మొండితనం అంటే అరుంధతికి భయం... దేన్నైనా గడ్డిపోచలా చూడగల మొండితనం. తన భర్త బతికి ఈ మాత్రంగానైనా ఉండటం రామారావు పుణ్యమే. అతను చెప్పిన ఇబ్బంది కాదనటానికి వీలులేదు. తనకీ వేరే దారి లేదు.

*

రామారావు రాక కోసం ఎదురుచూస్తోంది అరుంధతి. అతను వచ్చాక మాటలు ఎలా సాగుతాయో, ఏం జరుగుతుందోనన్న బెదురుగా ఉంది.

రామారావు వచ్చాడు. రోజూ వచ్చినట్టు లేడు.

అతనికీ ఆరాటంగానే ఉంది.

"నా ఈ కష్టకాలంలో మీరు చేసిన సాయానికి మీరేం చెప్పినా నేను ఒప్పుకోవాలి. 'కేవలం సాయం కాదు... ఇందులో నాకూ సుఖం, ఆనందం ఉన్నాయిగా,' అని మీరు అనొచ్చు. కానీ నా వరకూ నాకు, మీరు అందించిన అండదండలు, ఓదార్పు సామాన్యమైనవి కావు. కానీ మీరు చెప్పిన విషయానికి 'సరే' అనలేకపోతున్నాను. సాధ్యమైనంతవరకూ ఆయన్ని నేనే దగ్గరుండి చూసుకుంటాను.

"మీరన్నట్టు ఎక్కడా చేర్చలేను. దయచేసి నన్ను మన్నించండి," అంది అరుంధతి.

చివ్వుమని కోపం ఎగదన్నుకొచ్చింది రామా రావుకి. ఎంత చేసినా, ఈ ఆడవాళ్లు ఇంతేనన్న అసహనం... తనని తక్కువ చేసిందన్న బాధ.

అతని ముఖంలో వస్తున్న మార్పుని గమనిం చింది అరుంధతి. కూర్చున్న చోటు నుంచి లేచి, కింద... అతని కాళ్ల దగ్గర కూర్చుని, అతని ఒళ్లో తలపెట్టు కుంది.

"కొంచెం పెద్ద మనసు చేసుకొని అర్థం చేసు కోండి. నా మనసులో ఎక్కువ, తక్కువ అన్నది లేదు.

"ఆయన బాగున్న రోజుల్లో, నిండైన భర్తలా నన్ను చూసుకున్నారు. మీరు చెప్పినట్టు ఆయన్ని ఆ హోమ్‌లో చేరిస్తే, నాకు శ్రమే ఉండదు. కానీ నా మనసుకే సమ్మ తంగా ఉండదు. ఒక్కరోజు కూడా సుఖంగా ఉండ లేను. ఇటువంటి నిస్సహాయ స్థితిలో ఆయనకి నేను ఉండాలి. నేను లేనన్న భావం ఆయనకి రాకూడదు. అందుకే ఆయన్నుంచి దూరం కాలేను."

వెంటనే ఆమె నుంచి వెళ్లిపోవాలనిపించింది రామారావుకి. అతని మోకాలి పై భాగంలో, లోపలికి ఇంకిన అరుంధతి కన్నీటితడి అతన్ని కట్టడి చేసింది.

మరికాస్సేపటికి నెమ్మదిగా ఆమెని తప్పించు కుని బయటకు వచ్చాడు. అసహనంగా వుంది. తను చెప్పినట్టే వింటుంది అరుంధతి అనుకున్నాడు. 'కాదు' అన్నదన్న బాధ తెలుస్తోంది.

అకస్మాత్తుగా ఆ భావన అతనిలో అలా మెదలక పోతే ఏం జరిగేదో? తన భార్య ఏం చేసింది.

అరుంధతి ఏం చేస్తానంటోంది? ఓ భార్యగా ఎంతటి బాధ్యత అరుంధతి అభ్యర్థనలో...

నిజానికి అరుంధతి తప్పేం వుంది? అన్ని సౌకర్యాలూ వుండి, ఏ ఇబ్బంది లేకపోయినా, అదనపు సౌఖ్యమని తన భార్య ఎవరితోనో వెళ్లిపోయింది.

అరుంధతి అలా చెయ్యటంలేదు. ఆమెకి కష్టా లన్నీ తప్పి సుఖంగా బతికే అవకాశాన్ని కావాలనే వద్దం టోంది. తిరిగి ఇబ్బందుల్లో, కష్టాల్లో బతకటానికైనా సిద్ధ పడుతోంది. కేవలం భర్త కోసం... కలిసి బతకటం అన్న ధర్మం కోసం... భర్త మీది అనురాగం కోసం. అరుంధతి లోని ఈ ఔన్నత్యం దృష్టికి వచ్చిన తర్వాత రామారావు వినమ్రుడైపోయాడు.

ఇందాక ఆమె తన ఒళ్లో తల పెట్టుకున్నప్పటి ఆమె బేలతనం గుర్తొచ్చింది. అప్పటి ఆమె కన్నీటి తడి అతనిలోని మంటని ఆర్పేసింది.

కొంచెం తనకి ఇబ్బంది వున్నా అరుంధతిని, మంగరాజుని వదలాలనిపించలేదు.

పది నిముషాలు కూడా కాకముందే అరుంధతి ముందుకు వెళ్లిపోయాడు.

ఏ అరమరికలు లేకుండా ఇద్దరూ కాస్సేపు మాట్లాడుకున్నారు. మంచుతెరేదో విడిపోయినట్లైంది.

మనసులు మరింతగా తేటపడిన తర్వాత ఆ ఇల్లు... అరుంధతే కాదు... మంగరాజు కూడా తన కుటుంబమే అనిపించింది రామారావుకి.

*స్వాతి మాసపత్రిక, మే 2012*

